క్లుప్తంగా

భక్తులతో కిటకిటలాడిన సాయి మందిరం

చింతపల్లి : మండల కేంద్రంలోని షిర్డీ సాయి నాథుడి దేవాలయం ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. నల్లగొండ జిల్లా నుంచే కాకుండా కరీంనగర్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, ఖమ్మం, గుంటూరు, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయినాథుడి దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు బారులుదీరారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, ఊరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3న టాలెంట్ టెస్ట్

దేవరకొండ : భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఈనెల 3న సాంఘిక శాస్త్ర ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు డివిజన్ పరీక్ష కేంద్రం కన్వీనర్ బక్కయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండ విద్యా డివిజన్ పరిధిలోని 11మండలాల నుండి సుమారు 250మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి ఉదయం 10గంటల లోగా విద్యార్థులు హాజరు కావాలని ఆయన కోరారు.

55డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్ : నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మిర్యాలగూడలో 55మంది వాహనదారులపై కేసు నమోదు చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా యువత కేరింతలు కొడుతుండగా పోలీసులు మాత్రం డ్రంక్ అండ్ డ్రైవ్‌తో చుక్కలు చూపించారు. రోడ్డుపై వచ్చే ప్రతి ఒక్కరికీ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పట్టణంతో పాటు మిర్యాలగూడ రూరల్ సర్కిల్ పరిధిలో 55కేసులు నమోదు చేశారు. కాగా నూతన సంవత్సరం వేల డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడంపై పలువురు మందుబాబులు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు.

భీమా కోరెగావ్ విజయ్ దివస్



మాట్లాడుతున్న రమేశ్‌నాయక్

చింతపల్లి : భీమాకోరెగావ్ విజయ్ దివస్‌ను మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ దేవరకొండ ఇన్‌చార్జ్ రమేశ్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర కృష్ణ మాట్లాడుతూ 500 మంది పోరాట యోధులు ప్రాణాలు లెక్కచేయకుండా బానిస సంకెళ్లు తెంచుకోవాలనే ధృడ సంకల్పంతో ముందుండి పోరాడి విజయం సాధించిన భీమాకోరెగావ్ విజయోత్సవ రోజును గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్‌ముదిగొండ మొగిలయ్య, శ్రీకాంత్, అంబేద్కర్, ప్రశాంత్, దత్తునాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటాల పంపిణీ



అంబేద్కర్ చిత్రపటాలను పంపిణీ చేస్తున్న కృష్ణ

చింతపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలను వింజమూరి కృష్ణ తన తండ్రి జ్ఞాపకార్థం ఆదివారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, శేఖర్, నగేశ్, సురేష్, రామకృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన ఉద్యోగులు



జెడ్పీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

నల్లగొండ : ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చింతపల్లి చలపతి, గాదరి చంద్రయ్య, నర్సింహ, అండాలు, గోవర్ధన్, భద్రాచలం, చింత యాదయ్య తదితరులు ఉన్నారు.

ఆగని రైళ్లు.. తప్పని ఇక్కట్లు

- మిర్యాలగూడ స్టేషన్‌లో నిలపని పలు రైళ్లు
- రెండో ప్లాట్‌ఫాంపై నిలపడంతో దివ్యాంగులకు ఇబ్బందులు
- రైళ్లు నిలిపేలా అధికారులను వేడుకొంటున్న ప్రయాణికులు



మిర్యాలగూడ రైల్వే స్టేషన్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ రైల్వే స్టేషన్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండేది. అయితే గుంటూరు నుంచి సికింద్రాబాద్‌కు రాత్రి వేళల్లో వెళ్లే రైళ్లు ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు, గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైళ్లు మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో నిలిచేవి. కరోనాకు ముందు రైళ్ల రాకపోకలు బాగానే ఉండేవి. కానీ కరోనా తరువాత రాత్రి వేళల్లో గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే పలు రైల్లు నిలపడం లేదు. మిర్యాలగూడ నుంచి ఎక్కువ శాతం ప్రయాణికులు ఆంధ్రప్రదేశ్, చైన్నై, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిషా, కేరళ, బీహార్, గుజరాత్, తిరుపతికి ఎక్కువగా రద్దీ ఉంటుంది. గుంటూరు నుంచి సికింద్రాబాద్‌కు రాత్రి వేళల్లో వెళ్లే రైళ్లు నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. కరోనాకు ముందు సికింద్రాబాద్ నుంచి మిర్యాలగూడ మీదుగా గుంటూరు వైపు వెళ్లే రైళ్లు లోకమాణ్య తికల్ టెర్మినల్, కాకినాడ ఎక్స్‌ప్రెస్, జన్మభూమి సూపర్ ఫాస్ట్, కాకినాడ భవనగర్ ఎక్స్‌ప్రెస్, డెమో ఎక్స్‌ప్రెస్ (స్పెషల్), శబరిఎక్స్‌ప్రెస్, ఫలక్‌నూమా సూపర్‌ఫాస్ట్, పల్నాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్, చైన్నై ఎక్స్‌ప్రెస్, రేపల్లే ఎక్స్‌ప్రెస్, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, డెల్టా సూపర్ ప్యాసింజన్, ఎంప్లాయిస్ స్పెషల్ తదితర రైళ్లు నడిచేవి. కానీ కరోనా తరువాత గుంటూరు నుంచి సికింద్రాబాద్‌కు రాత్రి వేళల్లో వెళ్లే చైన్నై ఎక్స్‌ప్రెస్, నారాయణాద్రి, విశాఖ, నర్సాపూర్, డెల్టా ప్యాసింజర్ రాను, పోను, రాజధాని ఎంప్లాయిస్ స్పెషల్ రైళ్లు ఆపడం లేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

రెండో ప్లాట్‌ఫాంపైనే రైళ్ల నిలుపుదల

ప్రతి రోజు రెండో ప్లాట్‌ఫాంపై నిలుపుదల చేస్తుండటంతో ఒక వైపు ప్రయాణికులు, మరోవైపు దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రైల్వే స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫాంలు ఉండగా వీటిలో మొదటి ఫ్లాట్‌ఫాంపై ప్రయాణికులకు అన్ని వసతులు ఉన్నాయి. రాత్రి వేళల్లో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు రెండోవ ప్లాట్‌ఫాంపై వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైలు వచ్చే సమయంలో 7నిమిషాల ముందు సమాచారం అందిస్తున్నారు. దీంతో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. అన్ని వసతులు కలిగిన ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై నిలుపుదల చేయాలని గతేడాదిలో స్థానిక ఎమ్మెల్యే న భాస్కర్‌రావు సికింద్రాబాద్ రైల్వే జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కొన్ని రోజుల పాటు 1వ ప్లాట్‌ఫాంపై రైళ్లను నిలుపుదల చేసి తిరిగి మళ్లీ రెండోప్లాట్‌ఫాంపైనే నిలుపుదల చేస్తుండటంతో ప్రయాణీకులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రి వేళల్లో రైళ్లు ఆపాలి



గుంటూరు నుంచి మిర్యాలగూడ మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్లు నిలుపుదల చేయకపోవడంతో కొంత ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళల్లో గుంటూరు నుంచి మిర్యాలగూడకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నాం. గతంలో రైళ్లు బాగానే నడిచాయి, కానీ ఇప్పుడు స్టాప్ లేకుండా చేయడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఈ విషయంపై పునరాలోచించాలి.

– దుర్గాప్రసాద్, మిర్యాలగూడ

కేంద్ర మంత్రికి లేఖను పంపించా



గుంటూరు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే రైల్లు రాత్రి వేళల్లో మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో రైళ్లు ఆపుదల చేయాలని కోరుతూ కేంద్ర, సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి లేఖను పంపించాం. ప్రయాణికుల ఇబ్బందుల దృష్టిలో పెట్టుకొని రాత్రి వేళల్లో సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్లు నిలుపుదల చేయాలి.

– మురళీ యాదవ్, మిర్యాలగూడ

ప్రతి ఒక్కరూ మానవత్వం చాటుకోవాలి



యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

హాలియా : పట్టణంలోని యాచకులు, అనాథలపై ప్రతి ఒక్కరూ మానవత్వంచాటాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాంపాటి పాండరయ్య అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హాలియా పట్టణంలోని అనాథలు, యాచకులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. చలికాలంలో వారు పడే బాధలను అర్థం చేసుకొని ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికీ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి నిరుపేదలకు సహాయం అందించామన్నారు. రామాలయం వద్ద ఉన్న గోవులకు పశుగ్రాసం కోసం రూ. 5వేలు వెచ్చించి మూగజీవాల ఆకలి తీర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కీసర యుగేందర్‌రెడ్డి, జువ్వాజి వెంకటేశ్వర్లు, వాసుదేవుల పుల్లారెడ్డి, తుమురుగోటి రామలింగయ్య, అనిమిరెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

దేవరకొండ : హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2023 క్యాలెండర్‌ను ఆదివారం దేవరకొండలో అసోసియేషన్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్ ఏర్పాటు చేసి మూడేళ్ల పూర్తయినట్లు వారు తెలిపారు. ఇప్పటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించామని, అసోసియేషన్ రానున్న రోజుల్లో అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రవికుమార్, అన్వేష్, నరేష్, సాయిచంద్ర, రిషి, అంజి పాల్గొన్నారు.

మంత్రి జగదీశ్‌రెడ్డికి శుభాకాంక్షలు

మిర్యాలగూడ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్ర మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని ఆదివారం సూర్యాపేటలోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ తిప్పన విజసింహారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టి బాబునాయక్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, బాబ్జీ తదితరులు ఉన్నారు.



మంత్రి జగదీశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న తిప్పన, తదితరులు

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

హాలియా : టీఎస్ యూటీఎఫ్ 2023నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం హాలియాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ ప్రకటించి పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గుండా కృష్ణమూర్తి, దాస వెంకన్న, జిల్లా కార్యదర్శి రాజు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎరనాగుల సైదులు, టీఎస్ యూటీఎఫ్ అనుముల మండల అధ్యక్ష, కార్యదర్శులు మన్నెం వెంకటేశ్వర్లు, రవీందర్, ఉపాధ్యక్షుడు చెన్ను వెంకట్‌రెడ్డి, మచ్చా సునిత, కోశాధికారి ప్రతాప్, సీనియర్ యూటీఎఫ్ నాయకులు కొడుమూరి వెంకట్రామ్‌రెడ్డి, వీరాసింగ్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కట్టెబోయిన సైదయ్య, రామకృష్ణారెడ్డి, మద్దెల ప్రసాద్, ప్రశాంత్ కుమార్, యాదయ్య, నాగయ్య, సురేష్, మన్నెం సౌజన్య, అంజయ్య, షర్ఫోద్దీన్, ఫిరోజ్‌మాలి, పద్మావతి, జ్యోతిలక్ష్మి, రాజా, బాస్కర్, గిరిజ, కలలత, శకుంతల, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

చింతపల్లి : మండలంలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో ఆదివారం త్రైయోదత్త బోధన సేవా సమిత హిందూ విజ్ఞాన వేదిక నల్లగొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో నల్లగొండ ఆచార్య బోధనానంద యోగేశ్వర సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ప్రజల మధ్య అనుమానాలను తొలగించడానికి భగవద్గీతలోని అంశాలపై ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన వేదిక నల్లగొండ కమిటీ అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశం, మేకల శ్రీనివాసులు, చంద్రమౌళీ, పాల్గొన్నారు.



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



అయ్యప్ప స్వామికి కనకాభిషేకం చేస్తున్న భక్తులు

డిండి : మండల కేంద్రంలోని హరిహరక్షేత్ర అయ్యప్ప ఆలయ ఆరో వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిత్యపూజ, ధ్వజారోహణం, శ్రీ విఘ్నేశ్వరుడి పూజ, లక్ష్మిగణపతి హోమం, పూర్ణాహుతి, హారతి, వివిధ పండ్ల రసాలతో అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకం, కనకాభిషేకం తదితర వంటి పూజా కార్యక్రమలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సాయంత్రం అయ్యప్ప స్వామి, పద్మావతి అలివేలుమంగ, శ్రీ వెంకటేశ్వర స్వామిని గ్రామపుర వీధుల గుండా ఊరేగించారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు మహాఅన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల సాయమ్మ కాశన్న, ఉప సర్పంచ్ నూకం వెంకటేష్,ఎంపీటీసీలు ఏటి. రాధిక కృష్ణ, బూషిపాక వెంకటయ్య,గురు స్వాములు శ్రీపతిరావు, మల్లేష్, కృష్ణ, శ్రీనువాసులు, రమేష్, రాంబాబు, మధు, దుర్గాప్రసాద్, వెంకట్, రామస్వామి, మల్లేష్, రామకృష్ణ, వెంకటయ్య,"విజయ్, నిత్యా, సైదులు, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో 'నూతన' వేడుకలు



ఆలయంలో పూజలు చేస్తున్న కేసీఆర్ సేవా దళం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

హాలియా : నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అనుముల మండలంతో పాటు హాలియా మున్సిపాలిటీ పట్టణంలో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కేసీఆర్ సేవా దళం జిల్లా అధ్యక్షుడు ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి స్థానిక స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా పట్టణ ప్రజలు పలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. తమ ఇళ్లలో కేక్‌లు కట్ కట్ చేశారు.

సావిత్రీబాయి పూలే జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



మిర్యాలగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాపోలు పరమేష్

మిర్యాలగూడ టౌన్ : దేశంలో మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రాపోలు పరమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునీక భారత చరిత్రలో ధృవతార సావిత్రీబాయి పూలే అని, ఆమె జయంతి సందర్భంగా అనేక కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 3న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా వివిధ రంగాల్లో నిబద్ధతతో అంకితభావం కనబర్చిన మహిళలను సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు కోలా సైదులు, పసుల కాశీ యాదవ్, నాగరాజు , తోట యోగేందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

దేవరకొండ : ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను ఆదివారం దేవరకొండ మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకోవడంతో పాటు మహిళలు ఇళ్ల ముందు రంగురంగులతో ముగ్గులు తీర్చిదిద్దారు. పలువురు నాయకులు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ నూతన సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

డిండి : మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద కేక్ కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఇంటి ముంగిట్లో వివిధ రంగులతో నూతన సంవత్సరాలనికి వెల్‌కమ్ చెప్పుతూ వేసిన ముగ్గులు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాశన్న, వెంకటేష్, శ్రీను, ఖలీం, శ్రీనివాస్‌గౌడ్, రాజు, రమేష్, నర్సింహ, భీముడు నాయక్, మైనోద్దీన్, తిరుపతయ్య, లింగమయ్య, పద్మ, సుధా, అనిత, రాణి, రాధిక, భాగ్యలక్ష్మి, లావణ్య, సత్యవాణి, భార్గవి, ఇందు, నందిని ,హైమావతి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల మార్పిడిపై అవగాహన



మాట్లాడుతున్న ఎండీ రజియుద్దీన్

రామగిరి(నల్లగొండ) : ఎంఐఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం రిజిస్ట్రేషన్ మార్పిడిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎండి.రజియుద్దీన్ పాల్గొని మాట్లాడుతూ పాత ఇళ్ల పట్టాలను పూర్వికుల నుంచి తమ పేరు మీద మార్చుకోవాలని సూచించారు. నల్లగొండ పాతబస్తీలో ఇంటి పట్టాలు పూర్వికుల పేరు మీద ఉన్నాయని, దీనివల్ల రిజిస్ట్రేస్‌కు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రఫీయుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మోయిన్, గౌస్, అబ్దుల్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణలో పెరిగిన ఆత్మహత్యలు

మిర్యాలగూడ టౌన్ : బంగారు తెలంగాణ అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు అప్పులు చేసి మరి గ్రామాలను అభివృద్ధి పనులను చేస్తే చేసిన బిల్లులకు డబ్బులు రాకపోవడంతో అప్పులు తీర్చలేక ప్రజా ప్రతినిధులు ఆత్మహత్యలకు పాలపడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో పనిచేసిన పనులకు డబ్బులు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయంలో బిల్లులు అందక పెరుగుతున్న ధరలతో తెచ్చిన అప్పులు తీర్చలేకనే ప్రజా ప్రతినిధులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఇబ్బందులు పెట్టకుండా ఆత్మహత్యలకు పాల్పడిన వారికి కూడా 10లక్షల రూపాయల చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



ఎస్పీకి పూల బొకే అందజేస్తున్న శంకర్‌నాయక్

నల్లగొండ : నూతన సంవత్సరం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆదివారం నల్లగొండలో ఎస్పీ రెమా రాజేశ్వరిని కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సద్దాం, అంజినాయక్ తదితరులు ఉన్నారు.

కర్ణాటకలో కల్లు నిషేధాన్ని ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌గౌడ్

మర్రిగూడ : కర్నాటక రాష్ట్రంలో కల్లును నిషేధించడం దుర్మార్గమని గీతపనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల నిరంజన్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కల్లుగీత వృత్తి నిషేధంతో సుమారు 70లక్షల గౌడన్నల జీవనం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో కల్లుపై నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి అయితగోని జంగయ్యగౌడ్, మిద్దె జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



శ్రీ వేంకటేశ్వర ఆలయలో పూజలు చేస్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో గల శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర ఆలయ మండపంలో ఆదివారం అన్నకుటోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో చతుర్వేద పండితుల సహకారంతో పంచోపనిషత్తులు, పంచసూక్తాది వేదమంత్రాలతో స్వామివార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పవన్‌శర్మ, సుబ్బయ్యశాస్త్రి, మేడ ప్రభాకర్, గోపాల కృష్ణమూర్తి, గిరాజ నాగేశ్వరరావు, కృష్ణమాచారి పుల్లయ్య, తిరుమలనాథ్, తిరుమలనాథ్, భారతి, జ్యోతి, సింధూర, సుమలత తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం కమిటీలో నార్కట్‌పల్లివాసులకు చోటు

నార్కట్‌పల్లి : శ్రీశైలంలోని అఖిల భారత శ్రీశైల కుమ్మర శాలివాహన నిత్య అన్నదాన సత్రంలో జరిగిన ఎన్నికల్లో నార్కట్‌పల్లి మండలానికి చెందిన ముగ్గురికి అవకాశం దక్కింది. సత్రం సంయుక్త కార్యదర్శిగా నార్కట్‌పల్లికి చెందిన బండారు సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా శాపల్లి గ్రామానికి చెందిన నిమ్మనగోటి వెంకన్న, కార్యవర్గ సభ్యుడిగా అమ్మనబోలు గ్రామానికి చెందిన మిడిదొడ్డి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు ఆదివారం నార్కట్‌పల్లిలో మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన సత్రం అధ్యక్షుడు బండారు భిక్షపతి, రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్షుడు జయంత్‌రావు, దయానంద్, భిక్షపతిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే చెత్తకుప్పలు



నాల్గో వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పేరుకుపోయిన చెత్త

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని హిల్‌కాలనీలో నాల్గో వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు పెరిగాయి. పక్కనే ఆ ప్రాంతంలో ఇళ్లు కలిగిన వారంతా చెత్త తెచ్చి అక్కడే దిబ్బలుగా పోస్తున్నారు. మున్సిపాలిటీ సిబ్బంది రెండు రోజులకోమారు చెత్తను తీసుకెళ్తుండటంతో చెత్తంతా గుట్టలుగా పేరుకుపోయి ట్రాన్స్‌ఫార్మర్ చెత్తకుప్పలోకి పోతుంది. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఆ వార్డు సభ్యులు కోరుతున్నారు.

ఇళ్ల చుట్టూ మురుగు

- వెదజల్లుతున్న దుర్గంధం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

నిడమనూరు : మండలంలోని బొక్కమంతుల పాడ్‌లోని ఐదో వార్డులో మురుగు నీరు ఇళ్ల ముందుకు చేరి దుర్గంధం వెదజల్లుతుంది. ప్రధాన డ్రైయినేజీలోని నీరు ముందుకు వెళ్లకుండా నిలిచిపోవడంతో సమస్యల నెలకొన్నది. మురుగనీరంతా బయటకు వస్తున్నాయి. అలా వచ్చిన మురగు నీరు ఇళ్ల చుట్టూ నిలిచి పోతుంది. పదిరోజులగా ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక మురుగు కాల్వ చివరి భాగంతో నీరు రైతుపొలంలోకి వెళ్తున్నాయని రైతు అభ్యంతరం తెలపడం, పైప్ కల్వర్టు మూసివేయడంతో ఈసమస్య ఏర్పడింది. గతంలోనే నీరు వెళ్లేదని, కానీ కొత్త రోడ్డు వేయడం, నూతనంగా పైప్ కల్వర్టు నిర్మాణం చేసిన తరువాత దానిని బంద్ చేయడంతో నీరు వెళ్లకుండా నిలిచిపోతుందని సర్పంచ్ రమేశ్ తెలిపారు. ఉన్నతాదికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆ కుటుంబాల వారు కోరుతున్నారు.





బొక్కమంతులపాడ్‌లో ఇళ్ల చుట్టూ నిలిచిన మురుగు నీరు